క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లకు చేరిన సిబ్బంది



సామగ్రితో వస్తున్న పోలింగ్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర శాసన సభ ఎన్నికలు గురువారం జరగనున్న సందర్భంగా బుధవారం సాయంత్రం ఆయా పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సిబ్బంది ప్రత్యేక వాహనాలలో చేరుకున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో 37 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సిబ్బందికి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అన్ని రకాల వసతులను కల్పించారు.

గ్రామాలకు చేరుకున్న ఈవీఎంలు

జగిత్యాలరూరల్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం బుధవారం జగిత్యాల మినీ స్టేడియం నుంచి ఈవీఎంలతో పాటు, సామగ్రితో ఎన్నికల సిబ్బంది బుధవారం మధ్యాహ్ననికే వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. దీంతో పోలింగ్ అధికారులు పోలింగ్ గదులను సిద్ధం చేశారు. ఓటర్లు సజావుగా వినియోగించుకునేలా, వెలుతురు ఉండేలా ఏజెంట్లు కూర్చుండేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పోలీస్ శాఖ పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో హద్దులను ఏర్పాటు చేశారు. 100 మీటర్లలోపు ఓటర్లు తప్పా ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన

మెట్‌పల్లి: పట్టణంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను బుధవారం కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ప్రతి కేంద్రంలో లైట్లు, నీటి వసతి వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కరిస్తానని కేంద్రంలోని సిబ్బందికి సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా మున్సిపల్ తరఫున పూర్తిగా సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కథలాపూర్: ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీడీవో జనార్దన్ కోరారు. గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం మండలంలోని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బుధవారం తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో 41 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు 130 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేశామని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

బాదనకుర్తి వంతెన వద్ద వాహనాల తనిఖీ



కారు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ బాదనకుర్తి వంతెన వద్ద ఎక్సైజ్ సీఐ రాధ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతరం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు మొగిలిపేట,రాఘవపేట, రేగుంట గ్రామాల్లో బుధవారం వైన్‌షాపులను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు వైన్ షాపులు మూసివేసి ఉంచాలని, ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా మద్యం రవాణా, పంపిణీ చేస్తే చట్టరీత్యా కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్ 2న మల్లన్నపేట ఆలయంలో వేలం

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయంలో డిసెంబర్ 2 శనివారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఇందులో భాగంగా కొబ్బరికాయలు అమ్ముకునేందుకు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు, గండదీపం నూనె అమ్ముకునేందుకు, బెల్లం అమ్ముకునేందుకు రూ.10 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

బాట లేని బడులు..

- కేజీబీవీ, మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు గుంతలరోడ్డే దిక్కు
- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పదేళ్లుగా నాన్చుతున్న పాలకులు



కథలాపూర్‌లో మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల, కేజీబీవీలకు వెళ్లే దారి



జూనియర్ కళాశాల రోడ్డుపై వర్షపునీటిలో వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

కథలాపూర్: కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన జూనియర్ కళాశాల, పాఠశాలలకు రహదారి కరువైంది. గుంతలమయమైన రోడ్డు, తుమ్మచెట్ల మధ్యలో నుంచి పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందని సిబ్బంది, విద్యార్థులు వాపోతున్నారు. కథలాపూర్ మండల కేంద్రంలో గ్రామానికి కాస్తా దూరంగా పోలీస్‌స్టేషన్ వెనుకవైపు మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల భవనాలను కోట్లాది రూపాయాలు వెచ్చించి నిర్మించారు. కానీ ఆయా విద్యాలయాలకు చేరుకునేందుకు సీసీరోడ్డు వేయడం మరిచిపోయారు. సుమారు పదేళ్ల నుంచి పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, సిబ్బంది, వెయ్యి మంది విద్యార్థులు బురదలో, తుమ్మ చెట్ల మధ్యన నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. సీసీరోడ్డు, వర్షపునీరు వెళ్లేందుకు ప్రత్యేక కాలువ నిర్మిస్తేనే శాశ్వతంగా సమస్య పరిష్కారమవుతుందని వారు చెబుతున్నారు.

గుంతలమయమైన రోడ్డే దిక్కు..

కోరుట్ల–వేములవాడ డబుల్ రోడ్డు నుంచి కథలాపూర్‌లో సుమారు 500 మీటర్ల దూరంలోనే ఈ మూడు విద్యాలయాలను నిర్మించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్‌కు వెళ్లాలంటే వర్షాకాలంలో బురదరోడ్డే దిక్కు. మిగతా రోజుల్లో గుంతల రోడ్డే దిక్కు. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే విద్యార్థులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. పభుత్వం, అధికారులు చొరవ చూపి ఆయా కళాశాలలు, స్కూళ్లకు వెళ్లే రోడ్లను సీసీరోడ్డుగా మార్చాలని, రోడ్డుపైకి వర్షపు నీరు రాకుండా మరమ్మతులు చేయించాలని సిబ్బంది, విద్యార్థులు కోరుతున్నారు.

వర్షమొస్తే రాకపోకలకు ఇబ్బంది



కోరుట్ల–వేములవాడ డబుల్ రోడ్డుకు కాస్తా దూరంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్, కేజీబీవీ ఉన్నాయి. అప్పట్లో మట్టిరోడ్డు ఏర్పాడు చేశారు. వర్షం కురిసినప్పుడు రోడ్డు జలమయంగా మారడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులం రాకపోకలకు ఇబ్బందిపడుతున్నాం. మెయిన్‌రోడ్డు నుంచి సీసీ రోడ్డును వేయించాలి. అప్పుడే రాకపోకలకు ఇబ్బందులుండవు.

– సుదవేని హర్షిత్‌గౌడ్, ఇంటర్ విద్యార్థి, కథలాపూర్

ఎవ్వరూ పట్టించుకోలే



మోడల్ స్కూల్ రోడ్డు అధ్వానంగా ఉందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి అప్పట్లో తీసుకెళ్లాం. పలుమార్లు విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేశాం. అయినప్పటికీ సమస్యను పట్టించుకునేవారు కరువయ్యారు. పదేళ్లుగా సమస్యను పరిష్కరించకపోవడం పాలకుల నిర్లక్ష్యమే.

– కాశవత్రి వంశీ, చింతకుంట

సమస్యపై నిర్లక్ష్యం బాధాకరం



రోడ్డు సౌకర్యం లేక వెయ్యి మంది విద్యార్థులు ఇబ్బంది పడుతుంటే పదేళ్లుగా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరం. వర్షకాలంలో రోడ్డుపై నీళ్లు చేరితే నీళ్లలో నుంచి వెళ్లలేక విద్యార్థులు ఇంటికి తిరిగి వచ్చేవారు. అలాంటి పరిస్థితుల్లో సమస్య పరిష్కారంలో జాప్యం చేయడం విద్యార్థుల పట్ల వివక్ష చూపినట్లే. సమస్యను త్వరగా పరిష్కరించాలి.

– తెడ్డు మహేశ్, సిరికొండ

సీసీ రోడ్డు, ప్రత్యేక కాలువ నిర్మించాలి



మోడల్‌స్కూల్‌కు వెళ్లే రోడ్డు వర్షకాలంలో నీళ్లు ఉధృతంగా పారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఏళ్లుగా ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం చేయడం దారుణం. వర్షం కురిస్తే మట్టిపోయించి చేతులు దులుపుకోవడం సమంజసం కాదు. సీసీ రోడ్డు నిర్మించి వర్షపునీరు రోడ్డుపైకి రాకుండా ప్రత్యేక కాలువ నిర్మింస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– బాలె నీలకంఠం, బొమ్మెన

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మల్లాపూర్: మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన కోటగిరి లక్ష్మి నివాసంలో బుధవారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అర్చకులు మహేశ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పడిపూజలో వందలాది అయ్యప్ప దీక్షాపరులు పాల్గొనగా, శరణుఘోషతో ఆ ప్రాంగణమంతా మారుమ్రోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి నష్టం.. అందని సాయం

- భారీ వర్షాలకు పొలాల్లో ఇసుకమేటలు
- నష్టపోయిన రైతులు
- పరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపు



సారంగాపూర్‌లో ఓ రైతు పొలంలో వేసిన ఇసుకమేటలు

సారంగాపూర్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతన్నపై ప్రకృతితోపాటు పాలకులు పగబట్టారు. భారీ వర్షాలతో పంట పొలాలు నీట మునిగి ఇసుకమేటలు వేసి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తమ పొలాల్లో తమ సొంత ఖర్చులతో ఇసుకమేటలను తొలగింపజేసి, పొలాలు సేద్యానికి అనుకూలంగా మార్చుకున్నారు.

ఇసుకమేటలతో భారీగా నష్టం

2023 జులై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో ఎగువ నుంచి, గుట్టల ద్వారా వచ్చే వరదలు పొలాల్లో వచ్చి ఇసుకమేటలు, మట్టిదిబ్బలు పెట్టాయి. దీంతో కొంత మంది రైతుల పొలాలు నామరూపాలు లేకుండా పోయాయి. కొంత మంది రైతులు అప్పటికే నాట్లు పూర్తి చేయగా నాట్లు వేసిన పొలాలు ముంపునకు గురై ఇసుకమేటలు పెట్టాయి. దీంతో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో అధికారులు ప్రాథమిక సర్వే జరిపి ప్రభుత్వానికి నివేదిక అందించారు. సారంగాపూర్ మండలంలో 300 ఎకరాలు, బీర్‌పూర్ మండలాల్లో 35 ఎకరాల్లో ఇసుకమేటలు ఏర్పడినట్లు నివేదిక అందించారు. ఇదే సమయంలో రైతుల వారీగా సర్వే మాత్రం జరపకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికీ అందని పరిహారం..

భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొనడంతో రైతులు ఆశగా ఎదురు చూశారు. 2022 వర్షాకాలంలో వరదలకు రైతులకు భారీగానే నష్టం జరిగినా రూపాయి పరిహారం అందలేదు. ప్రస్తుతం 2023లో భారీ వర్షాలకు నష్టపోయినా.. రైతులకు ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని ప్రకటించడంతో రైతులు ఆశగా ఎదురుచూశారు. ఇప్పటికీ పరిహారం అందలేదు.

సొంత ఖర్చులతో సేద్యానికి అనువుగా చేసుకున్న రైతులు

రైతులు ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆలోచనతో ఇసుకమేటలు పెట్టిన భూముల్లోకి బ్లేడ్ ట్రాక్టర్లతో ఇసుకమేటలను తొలగించారు. భూముల్లో సారం కోల్పోవడంతో ఇటువంటి భూముల్లో మరింత సేంద్రియ, రసాయన ఎరువులు వెచ్చించి రైతులు సేద్యానికి అనుకూలంగా మార్చుకున్నారు. రైతులకు ఎకరాకు రూ. 20 వేలపైనే ఖర్చు అయినట్లు పేర్కొంటున్నారు.



ట్రాక్టర్‌తో ఇసుక మేటలు తొలగిస్తున్న రైతులు

పంట కాలం పూర్తయినా అందని పరిహారం..

నాట్లు వేస్తున్న సమయంలో భారీ వర్షాలకు ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రైతులు వరి పొలాలను కోస్తున్నారు. నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు రూపాయి అందలేదని రైతులు వాపోతున్నారు.

వరదలతో ఇసుకమేటలు



సారంగాపూర్‌కు ఓ రైతు వద్ద భూమిని కౌలుకు తీసుకుని పొలం సాగు చేశాను. నాట్లు పూర్తయిన తరువాత నా పొలంలోకి వరదలు వచ్చి ఇసుకమేటలు పెట్టాయి. ఇసుకమేటలు తొలగించి నాటు వేశాను. అయినప్పటికీ ఒక్క రూపాయి అందలేదు.

– కొత్తూరి పుష్పనాథ్, గిరిజన రైతు, నాయికపుగూడెం

నివేదికలు పంపించాం



రైతులకు జరిగిన నష్టం భర్తీ చేయడానికి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నష్టం పరిహారం అందుతుంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిహారం అందడానికి కొంత సమయం పడుతుంది.

– తిరుపతినాయక్, వ్యవసాయాధికారి,సారంగాపూర్

చిత్ర కథ: రహదారిపైనే ధాన్యం ఆరబోత



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ వెళ్లే మార్గంలో దారిపొడవునా ధాన్యం ఆరబోశారు. అసలే చిన్నపాటి రహదారి,అందులో రహదారి సగ భాగం వరకు ధాన్యం ఆరబోయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం గుండా ద్విచక్రవాహనాలు మినహాయిస్తే ఏ వాహనం వచ్చిన అవి వెళ్లేంత వరకు కొద్దిదూరంలోనే ఆగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. సమీపంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం మొత్తం ధాన్యంతో నిండిపోవడంతో స్థలం లేక రైతులు రహదారిపైనే ధాన్యం ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆకట్టుకుంటున్న మోడల్ పోలింగ్ కేంద్రాలు



కుమ్మరిపల్లిలో ఆదర్శ పోలింగ్ కేంద్రం



మెట్‌పల్లిలో మహిళా పోలింగ్ కేంద్రం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఆకట్టుకుంటున్నాయి. కేంద్రాల వద్ద స్వాగత తోరణాలను కట్టడంతో పాటు డెకరేషన్ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ఈ పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకుంటున్నాయి.



కొత్త దాంరాజుపల్లిలో యూత్ పోలింగ్ కేంద్రం

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో గురువారం నిర్వహించే శాసనసభ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల అధికారి ఖయ్యూమ్ తెలిపారు. మండలంలో 48, రాయికల్ పట్టణంలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

మల్లాపూర్: మండలంలోని 23 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 50 కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరుగనుంది. శాసనసభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు.మండల వ్యాప్తంగా 40,228 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. గొర్రెపల్లిలో మోడల్ పోలింగ్ కేంద్రం, ఒబులాపూర్‌లో మహిళా పోలింగ్ కేంద్రం, కొత్తదాంరాజుపల్లిలో యూత్ పోలింగ్ కేంద్రాలను ముస్తాబు చేశారు.


బీఆర్‌ఎస్ నాయకులతో చల్మెడ సమావేశం



బీఆర్‌ఎస్ నాయకులతో చర్చిస్తున్న చల్మెడ

కథలాపూర్: మండలకేంద్రంలో వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ పరిస్థితిపై చర్చించారు. పోలింగ్ సమయంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండి ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు గడ్డం భూమారెడ్డి, మామిడిపెల్లి రవి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అధ్వానంగా కండ్లపల్లి-మంగేళ రహదారి



కండ్లపల్లి-మంగేళ గ్రామాల మధ్య కంకర తేలిన రహదారి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి–మంగేళ గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రహదారి పూర్తి శిథిలమైపోయి నడవడానికి వీలు లేకుండా మారింది. మంగేళ–కండ్లపల్లి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ తారురోడ్డు మార్గాన వెళితే 6 కిలోమీటర్లు ఉంటుంది. రెండు గ్రామాల మధ్య దూరభారం తగ్గించడానికి వివిధ అభివృద్ధి నిధులు వెచ్చించి రెండు గ్రామాల మధ్య గతంలో కంకరతో రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ మార్గం గుండా రెండు గ్రామాల మధ్య దూరం కేవలం 2.50 కిలోమీటర్లు. ప్రస్తుతం రహదారిపై పూర్తిగా కంకరతేలి, గుంతలమయంగా మారడంతో వాహనాలు ఈ మార్గం గుండా వెళ్లడానికి వీలు లేకుండా పోయింది. కనీసం నడవానికి కూడా కష్టంగా ఉంది. రహదారికి ఇరువైపులా పొదలు, చెట్లతో రహదారి గుండా ఒంటరిగా ప్రయాణం చేయడం కూడా కష్టంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారిని తారు రహదారిగా అభివృద్ధి చేయడానికి నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా మంగేళ–రంగసాగర్ రహదారి కూడ ఆనవాళ్లు లేకుండా పోయింది. ఈ రహదారిని కూడ అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.